# వేటగాడు చూడని కన్నీరు

మూడు సంవత్సరాలైంది ఈ ఇంట్లో అడుగు పెట్టి. మనిద్దరి మధ్య కట్టుకున్న తెరలు, తెరలుగానే ఉన్నవి. ఇంకా మీ యెదుట మసలడానికి నాకు భయం వదలలేదు. ఇంకా నన్ను కన్నెత్తి చూడడానికి మీకు బుద్ధిపుట్టలేదు. ముందర గదిలో మీరూ, వెనుక గదిలో నేనూ, ఎన్నాళ్ళు సాగుతుంది ఈ జీవితం, ఇలా !

యంత్రంలాగా నేను తెర వెనుకనఉండి అన్నీ మీకోసం అమర్చి పెడితే, ఏ మాత్రమూ సందేహం లేకుండా మీరు, నిజంగా ఇది యంత్రమే, మనిషి కాదనుకుంటే ఏం చెయ్యగలను ?

ఒంటరిగా ఈ ఇంట్లో ఈ విశాలమైన ఖాళీ గదుల్లో పలకరించే దిక్కులేక నేను అలమటిస్తుంటే రాత్రిం పగలు ఈ ఒంటరితనం నన్ను దహించి వేస్తుంటె, పనిమనిషి నన్ను చూసి నిట్టూరిస్తే, ఈ అవమానం ఎలా భరించగలను !

మీరు అదృష్టవంతులు, ఉద్యోగరీత్యా ఇంటిముఖం చూడకుండా వీధిలోనే రోజంతా గడపగలరు. ఏ రాత్రివేళో ఊరు మాటుమణిగిన సమయంలో వరండాలో మెట్ల మీద మీ బూట్ల చప్పుడు వినిపిస్తే మనస్సులో ఉత్సాహానికిబదులు గుండెల్లో దడపుడితే, వణికే చేతులతో తలుపు తెరచిన నేను, ఎలా మీ ఎదుట పడగలను! చీకటి నీడలోంచి ఎలాదీపపుకాంతిలోకి రాగలను !

విసురుగా నీళ్ళగది తలుపుమూసి, మౌనంగా భోజనానికి కూర్చున్న మీకు, మారు వడ్డించడానికి నేను ముందుకు వస్తే విస్తరికి మీ చేయి అడ్డమయితే, ఎలా తొలగించగలను!

మూడేళ్ళుగా ఆలోచిస్తున్నాను. నేను చేసిన దోషమేమిటి? బలవంతంగా ఈ ఇంట్లో, మీ జీవితంలో ఎందుకు అడుగు పెట్టాను! బంధువు లందరికి దూరంగా మీకీ ఉద్యోగమూ! మనకీ ప్రవాసమూ! ఇంటి మీద చూపులేనిమీరూ! ఇంటి బయట చూపులేని నేనూ! అంతా ఏదో విచిత్రం!

ఆ వేళ, మీ నాన్నగారు, మా నాన్నగారితో "పిల్ల నచ్చింది" అని చెప్పినప్పుడు, అటూ ఇటూ ఇంటెల్లిపాది సంతోషించినప్పుడూ, ఏదో విచిత్రం! "అబ్బాయి పిల్లను చూడనక్కర లేదుట! అమ్మా నాన్నా చూస్తే చాలుట! ఎంత బుద్ధిమంతుడు!" అన్నారు కొందరు. ఎంత విచిత్రం అనుకున్నాను నేను. "అదికాదు. ఆ పిల్లవాడు కోరుకున్న పిల్ల దొరకలేదు. అంచేత ఏ పిల్లయినా సరే నంటున్నాడు" అన్నారొకరు "అమ్మో" అనుకున్నాను, గుండెల్లో ముల్లు గుచ్చుకొని. "ఆ, కానివాళ్ళు ఏదో కావాలనే అంటారు. మంచి సంబంధం చూసి ఊరుకోలేక చెడగొడదామని!" అన్నది అమ్మ. "అంతే కాబోలు" అనుకున్నాను ఊరట చెంది.

పెళ్ళిరోజు, "అంత నాజూకేమిటి, ఇంకొంచెం తలంబ్రాలు పొయ్యలేవా?" అన్నది మీ అత్తకూతురు. మీరు మాట్లాడలేదు. నాగుండె కంపించింది. "పాపం, రాధైతే పోసి

ఉందువు" అనిగొణిగింది చెప్పుతూ, మీ అత్తకూతురు. మాట రొదలో, మంత్రాల సందడిలో నాకు సరిగా వినిపించలేదు. "రాధ ఎవరు?" నా మనస్సు ఒక్కసారి ఇతరాలోచనలు మాని ప్రశ్నించుకుంది. ఒక్కసారి గుండె కలుక్కు మన్నది. మీరు ముఖం చిట్లించు కున్నారేమో మీ మరదలి మాటలకు, నేను చూడలేదు. జరుగుతున్న విందులు, సందడి, కోలాహలమూ, ఆ రెండు రోజులు మిమ్మల్ని, నన్నూ ఆలోచించుకోనివ్వలేదు. మనప్రమేయం లేకుండా ఒకకర్మకాండ ప్రారంభమై ముగిసింది.

"రాధ ఎవరు"? ఆప్రశ్న మళ్లామళ్లా స్ఫురిస్తూనే వుంది. అది నాకు సదా ధ్యాన మవుతుందని అప్పుడు అనుకోలేదు.

పెళ్ళయిన తరువాత, మీఇంట్లోఉన్న నాలుగురోజులు, ఆ పేరు మళ్ళా మళ్ళా వినిపిస్తూనే ఉంది. మాటల సందడిలో అస్పష్టంగా "రాధకన్నా ఈపిల్లే బాగుంది" అన్నారెవరో గోడ చాటున. "బాగుంది తాను వలచినది రంభ!" అన్నా రింకెవరో ఈసడింపుగా. నాగుండెలు కలుక్కుమన్నాయి. "ఈపేరు నన్ను వదలదా?" అనుకున్నాను నేను దిక్కుదోచక.

ఆవేళ మనం ప్రయాణం అవుతుంటే, అంటున్నారు మీ అమ్మగారు మీతో గదిలో "పాపం పసిపిల్ల నాయనా! ఎంత గారాబంగా పెరిగిందో! అందర్నీ వదలుకుని అంతదూరం వస్తోంది నీతో! ఎంత జాగ్రత్తగా చూచుకుంటావో? నీమీద నమ్మకంతో వాళ్ళమ్మకు నేను మాటయిచ్చాను. కలసిరాని ఆ రాధ గొడవ ఇంకెందుకు నీకు!" అని ఎంతో ప్రేమతో, బాధతో.

ఆమె కంఠంలోని ఆప్యాయతకు నాకు కళ్ళనీళ్లువచ్చాయి. రాధ ఎవరో ? ఎందుకు మీ నుంచి విడిపోయిందో ? ఈ పేరు మరపించలేనా నేను అనుకున్నాను.

ఇన్నాళ్ళకు ఇప్పుడు తెలుస్తోంది నావల్ల కాదని. ఈ ప్రయత్నంలో నా గుండెలు ముక్కలు ముక్కలుచేసుకున్నాను. ఉప్పొంగిన తరంగం ఉరవడించి గండశిలకు కొట్టుకుంటె ఏమౌ తుంది ? విరిగిపడి సుళ్ళు తిరిగి వెనక్కు మళ్ళుతుంది.

రాధ మీతో చదువుకుందా ? మీ ఇద్దరికీ ఎలాస్నేహ మైంది? ఎందుకు విడిపొయ్యారు? ఆమె మిమ్మల్ని తిరస్క రించిందా ? ఆమె బంధువులు అడ్డుపెట్టారా ? ఏమైంది ? ఏమిటి మీరు దాచుకున్న రహస్యం ? ఇవి ఏవీ నాకుచెప్పరు, తెలుసుకోవాలని నేను ఎంత తహ తహ లాడినా. నామీద దాక్షిణ్యం కాబోలు, నేను బాధపడతానని.

మొన్న సెలవుల్లో మీ అత్తకూతురు వచ్చినప్పుడు మెల్లిగా అడిగిచూశాను, "రాధఎవరూ?" అని. ఆమె తెల్ల పోతూ ముఖంచిట్లించి "రాధా? రాధ ఎవరూ?" అన్నది సంగ నాచిలా. ఆమెకు చెప్పడం ఇష్టంలేదని తెలుసుకున్న నేను, వెంటనే తేరుకుని నవ్వుతూ అన్నాను. "కథలో పాత్ర" అని. ఆ మె తెల్లబోయి నవ్వుతూ "ఏ కథా" అన్నది. ఎదురుగుండా "రాధ నవ్వింది" అన్న పుస్తకం కనిపించగానే ఇద్దరం గట్టిగా నవ్వుకుని సర్దుకున్నాం.

మీ గదిలో, మూలన బల్లమీద ఉన్న ఆ బుల్లిపూల సజ్జ ఎంత ముద్దుగా ఉందో! దుమ్ముపడిందని మొన్న దులప

బోయాను. అనుకోకుండా గదిలోకి వచ్చిన మీరు, అదరి పడ్డారు. ప్రపంచంలోని కర్కశత్వమంతా మీరు మ్రోగే కంఠంతో, "అదిముట్టుకోకు" అన్నారు. వణికి పోతున్న దేహంతో, నీళ్ళు నిండిన కళ్ళతో నేను బయటకు వెళ్ళిపోయాను.

అది మీకు ఆమె ఇచ్చిన కానుక కాబోలు! లేదా ఆమె కోసం మీరు దాచి అందజేయలేని కానుక! అది మీకు అతి పవిత్రమైనది కాబోలు! అది నేను ముట్టుకుంటే అపవిత్ర మౌతుందా?

ఆమెపై మీ మమకారమూ, ఆమె తిరస్కారమూ, ఈ రెండింటికి మధ్య ఏ సంబంధమూ లేని నేనెందుకు బలికావడము! ఆమెకు మీరు నచ్చలేదు కాబోలు; అందుకు శిక్ష నాకెందుకు విధించడం! మీ భగ్న వీణాతంత్రులతో నామెడకెందుకు సున్నితంగా ఉరిపోయడం! మీరు నామెడలో తాళి గట్టడానికి ఎందుకు ఒప్పుకున్నారు.

మీ తండ్రిగారు గొప్పహోదాలో ఉన్నారు. మీకు వంశ పారంపర్యంగా ధన ధాన్యాదులు నిండి ఉన్నాయి. మీరేమో గొప్ప ఇంజనీరనిపించుకున్నారు. అన్నివిధాలా ఇంతకన్న మంచిసంబంధం లేదనుకున్నారు మావాళ్ళు. అయినా నా జీవితం అడవిపాలు చేస్తున్నామని వాళ్ళకు తెలియదే ? తెలిస్తే మీ గొప్పదనానికి ఆశపడక ఏ బిచ్చగానికో నన్ను కట్టిపెట్టి ఉందురేమో !

మా అమ్మకు ఆరుగురు కొడుకుల తర్వాత నేనొక్కతెనే ఆడపిల్లను. ఆఖరు పిల్లను, ఆడపిల్లను కావడంచేత

మావాళ్ళు నన్ను ఎంతో ప్రేమతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. మాఅమ్మ, నాన్న, అన్నలూ, బంధువులు, నౌకర్లు అందరూ నన్నొక బంగారు బొమ్మనుచేసి నాతో ఆడుకున్నారు. మా ఇంటిలో నామాట కెప్పుడూ ఎదురులేదు. నాకు కావాలన్నది ఎప్పుడూ ఎవరూ లేదనలేదు. మాకూ ధనధాన్యాదులకు లోపంలేదు. మీ కిచ్చిన కట్నం పదివేలేకాదు, ఇంకా అంత మీరడిగినా మానాన్న ఇచ్చి ఉండును. వాళ్ళు ఆశపడింది నేను అన్ని విధాలా సుఖపడతానని, ఎడారిలో గుడారంవేసుకు కాపరం చేస్తానని కాదు. వాళ్ళు నన్నెంత ప్రేమతో చూచుకున్నారో, మీరంత ప్రేమతో చూచుకుంటారని.

పెళ్ళికి ముందురోజు నేను గులాబీ జరీపువ్వులచీరకట్టుకున్నాను. ఆకుపచ్చసాదా రెవిక తొడుక్కున్నాను. మావాళ్ళు నా ఒంటినిండా నగలు వాళ్ళ తృప్తితీరా అలంకరించారు. కాటుక కళ్ళతో, కళ్యాణపు బొట్టుతో నా ముఖం కళకళలాడింది. మా అమ్మమ్మ అన్నది: "పెళ్ళికొడుకుఇప్పుడుచూడాలి నిన్ను" అని నవ్వుతో. సిగ్గుతో కందిన నాముఖంలో తెచ్చిపెట్టుకున్న కోపం తొణికిసలాడింది. అమ్మ నవ్వింది. "బొమ్మలా అలా నిలుచుంటావే ? అమ్మమ్మకు దండం పెట్టు" అన్నది. నేను అతి వినయంగా వంగి ఆమె పాదాలు ముట్టుకున్నాను. ఆమె అతి ప్రేమతో లేవనెత్తి కౌగలించుకొంది. "పుత్రపౌత్రాభివృద్ధిగా వర్ధిల్లుతావు తల్లీ, నీ కే కొరతా వుండదు" అంటూ ఆనందంతో కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. పసితనంనుంచి పెనవేసుకున్న ప్రేమబంధం మా ఇద్దరి హృదయాలను ఆర్ద్రం

చేసింది. ఆమె మాటలు నాలో ఏవో ఆశలు నింపినాయి. కన్నులు కల్పనలో మునిగాయి.

ఆ దృశ్యం ఇవ్వాళ ఏదో హాస్యాస్పదంగా ఉన్నట్టున్నది.

మూడేళ్ళ నుంచి నేను అక్కడికి వెళ్ళినప్పుడల్లా అమ్మ, అమ్మమ్మ ఎంత తాపత్రయ పడుతున్నారో, నా ముఖంలో చిరునవ్వు రేఖలు చూడడానికి ! నేనెంత నరకయాతన అనుభవిస్తున్నానో, నాముఖంలో తొంగిచూచే విషాద రేఖలు దాచుకోడానికి; వాళ్ళ నెందుకు నేను దుఃఖంలో ముంచడం?

విందుకు పిలిచి ఇల్లుమాత్రం చక్కగా అలంకరించి, విస్తరి ఖాళీగా ఉంచినట్టున్నదీ జీవితం!

మా బంధువు లంతా నన్ను చుట్టుకున్నప్పు డంటారు. "ఎంత అదృష్టవంతురాలవు! ఎంతమంచి సంబంధం వచ్చింది నీకు !" అని అసూయతో. అమ్మ ఎంతో సంతోషిస్తుంది. విరక్తమైన నవ్వు పెదవి దాటకుండా దాస్తాను నేను. ఈకట్టుకున్న మేడ ఖాళీమేడ అని వాళ్ళ కెందుకూ తెలియడం!

మీతో చెప్పలేని మాటలు ఈ కాగితంతో చెపుతున్నాను ఏమీ తోచనప్పుడల్లా ! ఎందుకో ! మనస్సులో ఏదో ఆశ కాబోలు! ఎప్పుడో మసక చీకటి వేళ బయట జోరున భయంకరంగా వానకురుస్తుంటే గాలికి చెదరి ఈ కాగితాలు ముందరి గదిలో బందీ అయిన మీపాదాలముందు పడితే, పరధ్యానంగా కథ ఏమో అనుకుని మీరు చదివితే, మీ మనస్సు మారుతుందా? ఏమో! ఆశకు అంతులేదు. భ్రమకు విరుగుడు లేదు.

## వేటగాడు చూడని కన్నీరు

ఒక స్నేహితురాలన్నది అప్పు డెప్పుడో! "నీ కళ్ళు నిండిన సరస్సువలె ఎప్పుడూ తళతళా మెరుస్తుంటాయి" అని. నాకునవ్వు వచ్చింది. సరస్సులా? శ్రావణ భాద్రపదాలా? ఏమో! అవి తడి ఆరడం మాత్రం ఇంకా నేర్చుకోలేదు. ఆ తడి మీకు కనిపించదు కదా !